02-01-2021 ఉదయము : మురళి ఓంశాంతి "బాప్‌దాదా" మధువనము

"మధురమైన పిల్లలూ - తండ్రి శ్రీమతానికి రిగార్డ్ (గౌరవం) ఇవ్వడమంటే ఎప్పుడూ మురళిని మిస్ చేయకపోవడం, ప్రతి ఆజ్ఞను పాలన చేయడం."

ప్రశ్న :- పిల్లలైన మిమ్ములను ఒకవేళ ఎవరైనా మీరు కుశలం(రాజీ-ఖుషీ)గా, ఉన్నారా? అని అడిగితే మీరు రెప్పపాటులో (వెంటనే) ఏమని జవాబు చెప్పాలి?

జవాబు :- పరబ్రహ్మంలో ఉండే వారి గురించి చింత ఉండేది, వారు లభించేశారు, ఇంకా ఏం కావాలి? పొందవలసిన దానిని పొందేశాము,........... అని చెప్పండి. ఈశ్వరీయ పిల్లలైన మీకు ఏ విషయం గురించీ చింత లేదు. తండ్రి మిమ్ములను తమవారిగా చేసుకున్నారు, మీ పై కిరీటముంచారు, ఇంకా ఏ విషయము గురించి చింతించాలి.

ఓంశాంతి. బాబా తండ్రి, టీచర్, సుప్రీమ్ గురువు కూడా అని తండ్రి అర్థం చేయిస్తారు. పిల్లల బుద్ధిలో కూడా తప్పకుండా ఇదే ఉంటుంది, ఈ స్మృతిలోనే ఉంటారు. ఈ స్మృతిని ఎప్పుడూ, ఎవ్వరూ నేర్పించలేరు కూడా. తండ్రియే కల్ప-కల్పము వచ్చి నేర్పిస్తారు. వారే జ్ఞాన సాగరులు, పతితపావనులు కూడా వారే. వారు తండ్రి, టీచర్, గురువు కూడా. ఎప్పుడైతే జ్ఞాన మూడవ నేత్రం లభిస్తుందో అప్పుడే ఇది అర్థం చేయించ బడ్తుంది. పిల్లలు భలే అర్థం చేసుకొని ఉంటారు కాని తండ్రినే మర్చిపోతే, మరి టీచర్, గురువు ఎలా గుర్తుకు వస్తారు? మాయ చాలా ప్రబలమైనది. తండ్రి మహిమ మూడు రూపాలలో ఉన్నా ముగ్గురినీ మరపింపజేస్తుంది, మాయ ఇంత శక్తివంతమైనది. బాబా మేము మర్చిపోతున్నామని పిల్లలు కూడా వ్రాస్తూ ఉంటారు. మాయ ఇంత ప్రబలమైనది. డ్రామా అనుసారంగా చాలా సహజం. వారే తండ్రి, టీచర్, సద్గురువు ఇలా ఎప్పుడూ ఎవ్వరూ ఉండజాలరని పిల్లలు అర్థము చేసుకున్నారు. నిజం-నిజం. ఇందులో బడాయిలు మొదలైన విషయాలేవీ లేవు. లోలోపల ఇది అర్థం చేసుకోవాలి కదా! కాని మాయ మరపింపజేస్తుంది. మేము ఓటమి పాలవుతూ ఉంటే అడుగు-అడుగులో పదమాలు (కోటాను కోట్ల రెట్లు) ఎలా పొందగలమని అంటారు. పద్మాల గుర్తు దేవతలకేచూపిస్తారు. అందరికీ అలా చూపించరు. ఇది ఈశ్వరుని చదువు, మనుష్యులది కాదు. ఈ చదువు ఎన్నటికీ మనుష్యులది కాజాలదు. భలే దేవతలను మహిమ చేస్తారు అయినా ఉన్నతాతి ఉన్నతమైనవారు ఒక్క తండ్రియే. మిగిలినవారి బడాయి(గొప్పతనము) ఏముంది? నేడు భిక్షాటన, రేపు రాచరికం(రాజరికం). ఇప్పుడు మీరిలా(లక్ష్మీ-నారాయణులుగా) అయ్యేందుకు పురుషార్థము చేస్తున్నారు. ఈ పురుషార్థంలో చాలామంది ఫెయిల్ అవుతారని మీకు తెలుసు. చదువుతారు అయినా కల్పక్రితం ఎంతమంది పాస్ అయ్యారో, అంతమందే పాస్ అవుతారు. వాస్తవానికి జ్ఞానం చాలా సులభమైనది కాని మాయ

మరపింపజేస్తుంది. తండ్రి మీ చార్టు వ్రాయండి అని అంటారు. కాని వ్రాయలేకపోతారు. ఎంతవరకు కూర్చొని వ్రాస్తారు. వ్రాసినా - రెండు గంటలు స్మృతిలో ఉన్నామా? అని పరిశీలిస్తారు. ఇది కూడా తండ్రి శ్రీమతాన్ని అమలు చేసేవారికే తెలుస్తుంది. వీరికి పాపం సిగ్గు(లజ్జ) కలుగుతూ ఉండవచ్చని తండ్రి భావిస్తారు. లేకుంటే శ్రీమతం అమలులోకి తేవాల్సి ఉంటుంది. కాని రెండు శాతం మంది కష్టం మీద చార్టు వ్రాస్తారు. పిల్లలకు శ్రీమతం పై అంత గౌరవం లేదు. మురళి లభిస్తున్నా చదవరు. బాబా చెప్పేది నిజమేనని, మేము మురళియే చదవకపోతేఇతరులకు ఏం అర్థం చేయిస్తాము? అని వారి మనసులో తప్పకుండా అనిపిస్తుంది.

(స్మృతియాత్ర) ఓంశాంతి. ఆత్మిక తండ్రి ఆత్మిక పిల్లలకు అర్థం చేయిస్తారు - మనమంతా ఆత్మలమని, మమ్ములను పరమపిత పరమాత్మ చదివిస్తున్నారని పిల్లలు అర్థం చేసుకున్నారు. వారు ఇంకా ఏం చెప్తారు? నన్ను స్మృతి చేస్తే, మీరు స్వర్గానికి యజమానులుగా అవుతారు అని చెప్తారు. వీరిలో తండ్రీ ఉన్నారు, చదువును చదివించే శిక్షకుడు కూడా ఉన్నారు, సద్గతిదాత కూడా ఉన్నారు. కొన్ని పదాలతో మొత్తం జ్ఞానమంతా వచ్చేస్తుంది. ఇక్కడికి మీరు వచ్చేదే ఈ జ్ఞానాన్ని రివైజ్ చేసేందుకు తండ్రి కూడా ఇదే అర్థం చేయిస్తారు. ఎందుకంటే మేము మర్చిపోతాము, కనుక రివైజ్ చేసేందుకు ఇక్కడికి వస్తామని మీరు స్వయంగా చెప్తారు. భలే ఇక్కడ కొందరు ఉంటున్నా వారికి రివిజన్ జరగదు. అదృష్టంలో లేదు. యత్నమైతే(పురుషార్థమైతే) తండ్రి చేయిస్తారు. పురుషార్థము చేయించువారు కూడా ఒక్క తండ్రియే. ఇందులో ఎవ్వరికీ అతిథి మర్యాద(విశేష పాలన) కూడా జరగదు. స్పెషల్ చదువు కూడా లేదు. ఆ చదువులో అయితే స్పెషల్‌గా చదివించేందుకు టీచరును పిలిపిస్తారు. ఇక్కడైతే అదృష్టం తయారు చేసేందుకు అందరినీ చదివిస్తారు. ఒక్కొక్కరిని వేరు వేరుగా ఎంతవరకని చదివిస్తారు? ఎంతమంది పిల్లలున్నారు! ఆ చదువులో ఎవరైనా గొప్పవారి పిల్లలైతే వారిని స్పెషల్‌గా చదివిస్తారు. ఇతను డల్‌గా ఉన్నాడని టీచరుకు తెలుస్తుంది. అందువలన అతడిని స్కాలర్‌షిప్‌కు యోగ్యునిగా తయారుచేస్తాడు. ఇక్కడ తండ్రి అలా చెయ్యరు. ఇక్కడైతే అందరినీ ఏకరసంగా చదివిస్తారు. అది టీచరు ఎక్స్‌ట్రా(అదనపు) పురుషార్థం చేయించడం. ఇక్కడైతే వీరు ఎక్స్‌ట్రా పురుషార్థం ఎవ్వరికీ విడిగా చేయించరు. ఎక్స్‌ట్రా పురుషార్థమంటే మాస్టారు కొంత కృప చూపించడం. భలే పైసలు తీసుకుంటారు, కానీ ప్రత్యేకంగా టైమిచ్చి చదివిస్తారు, దానితో అతడు బాగా చదివి చురుకుగా (హుషారుగా) అవుతాడు. ఇక్కడైతే ఎక్కువగా చదివే మాటే లేదు. దీని విషయమే కొత్తది. ఒకే మహామంత్రం ఇస్తారు - “మన్మనాభవ”. స్మృతి ద్వారా ఏమవుతుందో మీకు తెలుసు. తండ్రియే పతిత-పావనుడని వారిని స్మృతి చేస్తేనే పావనంగా అవుతారని మీకు తెలుసు.

ఇప్పుడు పిల్లలైన మీకు జ్ఞానం ఉంది, ఎంతగా స్మృతి చేస్తారో అంత పావనంగా అవుతారు. తక్కువగా స్మృతి చేస్తే తక్కువ పావనంగా అవుతారు. ఇది పిల్లలైన మీ పురుషార్థం పై ఆధారపడి ఉంది. అనంతమైన తండ్రిని స్మృతి చేయడం ద్వారా మనము ఇలా(లక్ష్మీ-నారాయణులుగా) తయారవ్వాలి. వారి మహిమను గురించి అయితే ప్రతి ఒక్కరికీ తెలుసు. మీరు పుణ్యాత్మలు, మేము పాపాత్మలము అని అంటారు కూడా. అనేక మందిరాలు తయార్రై ఉన్నాయి. అక్కడికి అందరూ ఏం చేసేందుకు వెళ్తారు? దర్శనంతో లాభమైతే కొంచెం కూడా లేదు. ఒకరిని చూచి మరొకరు వెళ్తారు. అంతే, దర్శనం చేసు కునేందుకు వెళ్తారు. ఫలానావారు యాత్రకు వెళ్తున్నారు, మనం కూడా పోదాం అని భావిస్తారు. దీనితో ఏమవుతుంది? ఏమీ లేదు. పిల్లలైన మీరు కూడా యాత్రలు చేశారు.




ఎలాగైతే ఇతరులు పండుగలు జరుపుకుంటారో, అలాగే యాత్రను కూడా ఒక పండుగగా భావిస్తారు. ఇప్పుడు మీరు స్మృతియాత్రను కూడా ఒక పండుగగా భావిస్తారు. మీరు స్మృతి యాత్రలో ఉంటారు. ఉన్న మాట ఒకటే "మన్మనాభవ". మీది అనాది యాత్ర. వారు కూడా - ఈ యాత్ర మేము అనాదిగా చేస్తూ వచ్చామని అంటారు. కాని ఇప్పుడు మేము కల్ప-కల్పము ఈ యాత్ర చేస్తామని జ్ఞాన సహితంగా మీరు చెప్తారు. తండ్రియే వచ్చి ఈ యాత్రను నేర్పిస్తారు. వారు నాలుగు ధామాల యాత్ర జన్మ-జన్మలూచేస్తూ ఉంటారు. ఇక్కడైతే అనంతమైన తండ్రి అంటారు - "నన్ను స్మృతి చేస్తే మీరు పావనంగా అవుతారు." యాత్రల ద్వారా మీరు పావనంగా అవుతారని ఇంకెవ్వరూ ఎప్పుడూ చెప్పరు. మనుష్యులు యాత్రలకు వెళ్లినప్పుడు ఆ సమయంలో వారు పావనంగా ఉంటారు. ఈ రోజుల్లో అయితే అక్కడ కూడా అపవిత్రత, అశుద్ధత ఉంటోంది, పావనంగా ఉండడం లేదు. ఈ ఆత్మిక యాత్ర గురించి ఎవ్వరికీ తెలియదు. మీకైతే ఇప్పుడు తండ్రి అర్థం చేయించారు - ఈ

స్మృతియాత్ర సత్యమైనది. ఆ యాత్రలో తిరిగేందుకు వెళ్తారు అయినా ఎలా ఉండేవారు అలాగే ఉండిపోతారు. భ్రమణము చేస్తూనే ఉంటారు. ఎలాగైతే వాస్కోడిగామా సృష్టిచక్రం చుట్టి వచ్చాడో అలా ఇక్కడ తిరుగుతూ ఉంటారు. నాల్గు దిక్కులా ప్రదక్షిణ చేసినా.... ప్రతి క్షణం దూరంగా ఉండిపోయాం అనే పాట కూడా ఉంది కదా. భక్తిమార్గంలో అయితే వారితో ఎవ్వరూ కలపలేరు. భగవంతుడు ఎవ్వరికీ లభించలేదు. భగవంతుని నుండి దూరంగానే ఉన్నారు. భ్రమణంచేసి ఇంటికి వచ్చి మళ్ళీ పంచ వికారాలలోచిక్కుకుంటారు. ఆ యాత్రలన్నీ అసత్యమైనవి. ఇది పురుషోత్తమ యుగమని, తండ్రి వచ్చారని ఇప్పుడు పిల్లలైన మీకు తెలుసు. తండ్రి వచ్చేశారని ఒకనాడు అందరికీ తెలిసిపోతుంది.భగవంతుడు ఆఖరికి లభిస్తాడు, కాని ఎలా? ఇదైతే ఎవ్వరికీ తెలియదు. మేము శ్రీమతంఅనుసారంగా భారతదేశాన్ని మళ్ళీ స్వర్గంగా తయారు చేస్తున్నామని మధురాతి మధురమైన పిల్లలకైతే తెలుసు. మీరు భారతదేశం పేరే తీసుకుంటారు. ఆ సమయంలో వేరే ధర్మమేదీ ఉండదు. మొత్తం విశ్వమంతా పావనంగా అవుతుంది. ఇప్పుడైతే అనేక ధర్మాలున్నాయి. తండ్రి వచ్చి మీకు మొత్తం(కల్ప) వృక్ష జ్ఞానమంతా వినిపిస్తారు. మీరు దేవతలుగా ఉండేవారు మళ్ళీ మీరే క్షత్రియులు, మీరే వైశ్యులు, మీరే శూద్రులుగా అయ్యారని మీకు స్మృతిని ఇప్పిస్తారు. మీరే ఇప్పుడు బ్రాహ్మణులుగా అయ్యారని ఈ హం సో అర్థాన్ని తండ్రి ఎంత సులభంగా అర్థం చేయిస్తారు! ఓం అనగా నేను ఆత్మను తర్వాత ఆత్మలమైన మనము ఇలా చక్రంలో తిరుగుతాము. వారు ఆత్మయే పరమాత్మ ఆత్మలైన మనమే పరమాత్మ అనేస్తారు. హం సో యొక్క యథార్థమైన అర్థం తెలిసినవారు ఒక్కరు కూడా లేరు. కనుక తండ్రి చెప్తారు - ఈ మంత్రం ఏదైతే ఉందో దానిని ప్రతిక్షణం స్మృతి చేయాలి. చక్రం బుద్ధిలో లేకపోతే చక్రవర్తి రాజుగా ఎలా అవుతారు? ఇప్పుడు ఆత్మలైన మనము బ్రాహ్మణులము మళ్ళీ హం సో దేవతలుగా అవుతాము. ఇది ఎవరినైనా వెళ్ళి అడగండి, ఎవ్వరూ చెప్పలేరు. వారికైతే 84 జన్మల అర్థం కూడా తెలియదు. భారతదేశ ఉత్థానము మరియు పతనము మహిమ చేయబడ్డాయి. ఇది సరైనదే. సతోప్రధానము, సతో, రజో, తమో, సూర్యవంశీ, చంద్రవంశీ, వైశ్యవంశీ...... ఇప్పుడు పిల్లలైన మీకు అన్నీ అర్థమయ్యాయి. బీజరూపుడైన తండ్రినే జ్ఞానసాగరుడని అంటారు. వారు ఈ చక్రంలోకి రారు. జీవాత్మలమైన మనము పరమాత్మ అయిపోతామని కాదు. తండ్రి తమ సమానంగా నాలెడ్జ్‌ఫుల్‌గా తయారు చేస్తారు. గాడ్ తమ సమానంగా తయారు చెయ్యరు. ఈ విషయాలను చాలా బాగా అర్థం చేసుకోవాలి, అప్పుడే బుద్ధిలో చక్రం తిరగగలదు. దానికి స్వదర్శన చక్రమని పేరు పెట్టారు. మనము ఎలా ఈ 84 జన్మల చక్రంలోకి వస్తామో, మీరు బుద్ధితో అర్థం చేసుకో గలరు. ఇందులో అన్నీ వచ్చేస్తాయి. సమయము కూడా వస్తుంది, వర్ణము కూడా వచ్చేస్తుంది, వంశావళి కూడా వచ్చేస్తుంది.



ఇప్పుడు పిల్లలైన మీ బుద్ధిలో ఈ జ్ఞానమంతా ఉండాలి. జ్ఞానము ద్వారానే ఉన్నత పదవి లభిస్తుంది. జ్ఞానమంటే ఇతరులకు కూడా ఇస్తారు. ఇక్కడ మీతో ఎటువంటి పేపరు (ఫారం) మొదలైనవేవీనింపించరు. ఆ స్కూల్స్‌లో అయితే పరీక్షలు జరిగినప్పుడు ప్రశ్నపత్రాలు విదేశాల నుండి వస్తాయి. ఎవరైతే విదేశంలో చదువుతూ ఉంటారో, వారికైతే అక్కడే రిజల్టు వెలువడుతూ ఉండవచ్చు. వారిలో కూడా ఎవరైనా గొప్ప ఎడ్యుకేషన్ అథారిటీ ఉంటే పేపర్లు దిద్దుతుండవచ్చు. మీ పేపర్లు ఎవరు పరిశీలిస్తారు? స్వయంగా మీరే పరిశీలించుకుంటారు. స్వయాన్ని ఎలా కావాలనుకుంటే అలా తయారు చేసుకోవచ్చు. పురుషార్థంతో ఏ పదవి కావాలనుకుంటే ఆ పదవితండ్రి నుండి తీసుకోండి. ప్రదర్శని మొదలైన వాటిలో కూడా - ఏమవుతారు? దేవత అవుతారా, బారిస్టర్ అవుతారా ..... ఏమిగా అవుతారు? అని అడుగుతారు కదా. ఎంతగా తండ్రిని స్మృతి చేస్తారో, సేవ చేస్తారో అంత ఫలము లభిస్తుంది. ఎవరైతే తండ్రిని బాగా స్మృతి చేస్తారో, వారు మేము సర్వీస్ కూడా చెయ్యాలని అర్థము చేసుకుంటారు. ప్రజలను తయారు చేసుకోవాలి కదా! రాజధాని స్థాపన అవుతూ ఉంది మరి అందులోఅందరూ కావాలి. అక్కడ మంత్రిఉండడు. ఎవరికైతే తెలివి తక్కువగా ఉంటుందో వారికి మంత్రి అవసరముంటుంది. మీకు అక్కడ సలహా అవసరం ఉండదు. బాబా వద్దకు సలహా తీసుకునేందుకు వస్తారు - స్థూల విషయాలను గురించి సలహా తీసుకుంటారు. “ పైసలు ఏం చెయ్యాలి? వ్యాపారం ఎలా చెయ్యాలి? ” ఈ ప్రాపంచిక విషయాలను తండ్రి వద్దకు తీసుకు రావద్దని బాబా చెప్తారు. అవును మరి, ఎక్కడ మనసు చిన్నబుచ్చుకుని వెళ్ళిపోరాదని ఓదార్చుటకు ఎంతో కొంత చెప్తారు. అయితే ఇది నా పని కాదు. నాదైతే మీకు దారి చూపే ఈశ్వరీయ వ్యాపారము. ఏ దారి? మీరు విశ్వానికి యాజమానులుగా తయారయ్యే దారి. మీకు శ్రీమతం లభించింది. మిగిలినవన్నీ ఆసురీ మతాలు. సత్యయుగంలోనిది శ్రీమతమని అంటారు, కలియుగంలో ఆసురీ మతమని అంటారు. అది సుఖధామము. అక్కడ ‘ కుశలమా?

ఆరోగ్యం బాగుందా? ' అని కూడా అడగరు. ఈ వాక్యం అక్కడ ఉండదు. ' ఏమీ కష్టమైతే లేదు కదా? కులాసాగా ఉన్నారా? ' అని ఇక్కడ అడుగుతారు. ఇందులో కూడా చాలా విషయాలు వచ్చేస్తాయి. అడిగేందుకు అక్కడ దు:ఖమే ఉండదు.ఇక్కడ ఉన్నదేదు:ఖమయ ప్రపంచం. వాస్తవానికి మిమ్ములను ఎవ్వరూ అడగలేరు. భలే మాయ పడవేసేదే అయినా తండ్రి లభించారు కదా. మీరు అంటారు - "ఏమిటి మీరు క్షేమసమాచారాలు అడుగుతున్నారా? మేము ఈశ్వరుని పిల్లలం, మమ్ములను ఏం కుశల-క్షేమం అడుగుతారు? పరబ్రహ్మంలో ఉండు తండ్రి గురించి చింత(ధ్యాస) ఉండేది, వారు దొరికేశారు. ఇక మాకు చింత దేనికి! మనము ఎవరి పిల్లలం! అని ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలి. మనము పావనంగా తయారైతే మళ్లీ యుద్ధం ప్రారంభమైపోతుందనే జ్ఞానం కూడా బుద్ధిలోఉంది. మరి ఎవరైనా మిమ్ములను 'మీరు కులాసాగా ఉన్నారా?' అని ఎప్పుడు అడిగినా, మేము సదా సంతోషంగానే ఉన్నామని చెప్తారు. జబ్బుగా ఉన్నా తండ్రి స్మృతిలో ఉంటారు. మీరు స్వర్గంలో కంటే ఎక్కువ సంతోషంగా ఉంటారు. ఎందుకంటే స్వర్గంలో చక్రవర్తి పదవి నిచ్చే తండ్రి లభించారు. వారు మమ్ములను ఇంత యోగ్యులుగా చేస్తే, మాకు చింత ఏముంది! ఈశ్వరుని పిల్లలకు చింత ఏముంది! అక్కడ దేవతలకు కూడా చింత లేదు. దేవతల పైన ఈశ్వరుడున్నారు. మరి ఈశ్వరుని పిల్లలకు ఏదైనా చింత ఉండగలదా! బాబా మనలను చదివిస్తారు. బాబా మా టీచరు, సద్గురువు. బాబా మన పై కిరీటం పెడ్తున్నారు. మనము కిరీటధారులుగా అవుతున్నాము. విశ్వకిరీటం ఎలా లభిస్తుందో మీకు తెలుసు. తండ్రి కిరీటం ధరించరు. సత్యయుగంలో తండ్రి తన కిరీటాన్ని తన పిల్లల పై ఉంచుతారని కూడా మీకు తెలుసు. ఆ పిల్లలను ఆంగ్లంలో క్రౌన్‌ప్రిన్స్ అని అంటారు. ఇక్కడ తండ్రి కిరీటం పిల్లలకు లభించే వరకు తండ్రి ఎప్పుడు మరణిస్తాడా, ఎప్పుడు కిరీటం నా తల పైకి వస్తుందా అని పిల్లలకు ఉత్కంఠత ఉంటుంది. ప్రిన్స్ నుండి మహారాజుగా అవ్వాలి అనే ఆశ ఉంటుంది. అక్కడైతే ఇటువంటి విషయమేదీ ఉండదు. సమయానికి పద్ధతి అనుసారంగా తండ్రి పిల్లలకు కిరీటం ఇచ్చి తాను తప్పుకుంటాడు. అక్కడ వానప్రస్థం గురించిన చర్చ ఏదీ ఉండదు. పిల్లలకు మహలు మొదలైనవి నిర్మించి ఇస్తారు, ఆశలన్నీ పూర్తవుతూ ఉంటాయి. సత్యయుగంలో సుఖమే సుఖముంటుందని మీరు అర్థం చేసుకోగలరు. మీరు ఎప్పుడైతే అక్కడికి వెళ్తారో అప్పుడు సుఖాలన్నీ ప్రాక్టికల్‌గా పొందుతారు. స్వర్గంలో ఏముంటుందో, ఒక శరీరాన్ని వదిలి ఎక్కడకు వెళ్తారో మీకు తెలుస్తుంది. ఇప్పుడు తండ్రి మిమ్ములను ప్రత్యక్షంగా చదివిస్తున్నారు. మనము నిజంగా స్వర్గానికి వెళ్తామని మీకు తెలుసు. వారు మేము స్వర్గములోకి వెళ్తామని అంటారు కానీ వారికి స్వర్గమని దేనిని అంటారో కూడా తెలియదు. జన్మ-జన్మాంతరాలుగా ఈ అజ్ఞానపు మాటలు వింటూ వచ్చారు. ఇప్పుడు తండ్రి మీకు సత్యమైన విషయాలు

వినిపిస్తారు. మంచిది.

మధురాతి మధురమైన అపురూపమైన పిల్లలకు మాత - పిత, బాప్‌దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్‌మార్నింగ్ ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:

1. సదా కుశలంగా, సంతోషంగా ఉండేందుకు తండ్రి స్మృతిలో ఉండాలి. చదువు ద్వారా తమ పై రాచరిక కిరీటాన్ని ధరించాలి.
2. శ్రీమతమును అనుసరించి భారతదేశాన్ని స్వర్గంగా తయారుచేయు సేవ చెయ్యాలి. సదా శ్రీమతానికి రిగార్డ్ ఇవ్వాలి(గౌరవమునివ్వాలి).

వరదానము :- " కనెక్షన్(సంబంధము) మరియు రిలేషన్ ద్వారా మనసా శక్తి యొక్క ప్రత్యక్ష ప్రమాణాన్ని చూచే సూక్ష్మ సేవాధారీ భవ."

ఎలాగైతే వాచాశక్తి లేక కర్మణా శక్తుల ప్రత్యక్ష ప్రమాణము కనిపిస్తుందో అలా అన్నిటి కంటే శక్తివంతమైన సైలెన్స్‌శక్తి యొక్క ప్రత్యక్ష ప్రమాణాన్ని చూచేందుకు బాప్‌దాదా జతలో నిరంతరం క్లియర్ (స్పష్టమైన) కనెక్షన్ మరియు రిలేషన్ ఉండాలి. దీనినే యోగబలమని అంటారు. ఇటువంటి యోగబలము గల ఆత్మలు స్థూలంలో దూరంగా ఉండే ఆత్మకు సన్ముఖం యొక్క అనుభవాన్ని చేయించగలవు. ఆత్మలను ఆహ్వానించి వాటిని పరివర్తన చేయగలవు. ఇదే సూక్ష్మమైన సేవ. ఇందుకు ఏకాగ్రతా శక్తిని పెంచండి.

స్లోగన్ :- " తమ వద్ద ఉన్న సర్వ ఖజానాలను సఫలం చేసేవారే మహాదాని ఆత్మలు. "

-: ఓంశాంతి :-

## జనవరి నెలలో విశేష తపస్య కోసం పాయింట్లు

## బ్రహ్మా బాబా యొక్క 18 అడుగులు

### 2. తనకంటే కూడా ఉన్నతంగా చేయాలనే భావన:

ఎలాగయితే బ్రహ్మా బాబా పిల్లలను తనకంటే ఉన్నతంగా తయారు చేసారో, ప్రతి వానిని "ముందు మీరని" అంటూ వానికి గౌరవం ఇచ్చారో , :ముందు మీరు" అనే పాఠాన్ని వృత్తి, దృష్టి, వాణి మరియు కర్మలలో తెచ్చారో, మాతలను, సోదరీలను ఎప్పుడూ ముందు ఉంచారో, అలాగే, ఫాలో ఫాదర్ చేస్తే , బాబా సమానంగా అవుతారు